కృతజ్ఞతాభావం.. ఉరుసు ఉత్సవం

నేటి నుంచి జానీబాషా సాహెబ్ ఉరుసు


జానీబాషా సాహెబ్ దర్గా (ఇన్‌సెట్‌లో) ఫైల్‌ఫొటో

రాజంపేట టౌన్ : కొంతమంది చేసిన మేలును ఎన్నటికీ మరువరు. అలాంటి కోవకు చెందిన వారే జానీబాషాపురం వాసులు. దశాబ్దాలు గడుస్తున్నా చేసిన మేలుకు కృతజ్ఞత చూపుతున్న జానీబాషాపురం వాసుల కృతజ్ఞతభావం ఆదర్శనీయం కూడా. జానీబాషా సాహెబ్ (జానీమియా) అనే గురువులయ్య ప్రస్తుతం జానీబాషాపురంగా పిలవబడే గ్రామంలోని నిరుపేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు మూడు ఎకరాల స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు. దీంతో అక్కడి ప్రజలు జానీబాషా సాహెబ్ చేసిన మేలుకు గుర్తుగా ఉరుసు ఉత్సవాన్ని నిర్వహిస్తూ తమ కృతజ్ఞతను చాటుకుంటూ వస్తున్నారు. ఇక్కడ జరిగే ఉరుసు ఎంతో ప్రసిద్ధిగాంచింది. కాగా శనివారం నుంచి ఉరుసు ఉత్సవం ప్రారంభంకానుంది. ఇందుకోసం నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. అలాగే ఉరుసు కోసం బంధువులు రావడం, వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేయడంతో జానీబాషాపురంలో సందడి వాతావరణం నెలకొంది.

ఉరుసుకు ఆసక్తికర నేపథ్యం

జానీబాషాపురంలో నిర్వహించే జానీబాషా సాహెబ్ ఉరుసుకు ఆసక్తికర నేపథ్యం ఉన్నట్లు జానీబాషాపురానికి చెందిన పెద్దలు చెబుతున్నారు. జానీబాషా సాహెబ్ తమిళనాడు రాష్ట్రంలోని సేలంకు చెందిన వారు. 1920వ సంవత్సరంలో జానీబాషా సాహెబ్ ప్రస్తుతం ఉన్న జానీబాషాపురం ప్రాంతానికి వచ్చారు. తొలి నుంచి జానీబాషా సాహెబ్‌కు వైద్యం, మంత్రాలు వంటివి తెలియడంతో ప్రజలకు ఆయన ఉచితంగా వైద్యం చేసేవారు. అలాగే అప్పట్లో ఉన్న గాలి, పీడ వంటివాటిని తన మంత్రాలతో పారద్రోలేవారని ఆ ప్రాంత ప్రజలు చెప్పారు. అప్పట్లో పేదరికం ఎక్కువగా ఉండటంతో తనవద్దకు వైద్యం చేయించుకునేందుకు వచ్చిన వారికి ఉచితంగా వైద్యం చేయడంతోపాటు అంతోఇంతో డబ్బు ఇచ్చి జానీబాషా ఆదుకునేవారు. ఇదిలావుంటే ఇక్కడికి వచ్చిన తొలినాళ్ల నుంచే జానీబాషాపురానికి పక్కనే ఉన్న తుమ్మల అగ్రహారానికి చెందిన షడదర్శనం సుబ్బయ్యశాస్త్రి, జానీబాషా సాహెబ్ ప్రాణస్నేహితులయ్యారు. ఈ నేపథ్యంలో షడదర్శనం సుబ్బయ్యశాస్త్రి కుమార్తె లక్ష్మీదేవి అనారోగ్యం బారిన పడింది. దీంతో ఆయన తన కుమార్తెకు పెద్ద పెద్ద నగరాల్లోని ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా ఆరోగ్యం కుదుటపడలేదు. చివరికి సుబ్బయ్యశాస్త్రి తన కుమార్తె ఆరోగ్య పరిస్థితి గురించి జానీబాషా సాహెబ్‌కు తెలియజేసి, తన కుమార్తె ఆరోగ్యం కుదుటపడేలా చేయాలని కోరాడు. దీంతో ఆయన తనకు తెలిసిన వైద్యంతో సుబ్బయ్యశాస్త్రి కుమార్తె ఆరోగ్యం కుదుటపరిచాడు. ఇందుకు సుబ్బయ్యశాస్త్రి ఎంతో ఆనందపడి 1943వ సంవత్సరంలో తనకు చెందిన 3.2 ఎకరాల భూమిని జానీబాషా సాహెబ్ పేరిట రాసిచ్చాడు.. అయితే సేవాభావం కలిగిన జానీ సాహెబ్ ఆ భూమిని అక్కడున్న పేదలందరికి పంపిణీ చేసి ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఆ స్థలాన్ని ఎవరూ విక్రయించకుండా, వారి వారసులు మాత్రమే అనుభవించేలా రాతపూర్వకంగా రాయించాడు. అనంతరం కొంతకాలానికి ఆయన అదే గ్రామంలో జీవసమాధి అయ్యారు. దీంతో జానీబాషాసాహెబ్ చేసిన మేలును ఆ గ్రామ ప్రజలు మరచిపోకుండా జీవసమాధి అయిన చోటే దర్గాను నిర్మించారు. అలాగే ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తూ తమ కృతజ్ఞతను చాటుకుంటుండటం విశేషం.

ఊరునిచ్చిన మహనీయుడు



జానీబాషా సాహెబ్ మాకు గూడునివ్వడమే కాదు ఓ ఊరునిచ్చిన మహనీయుడు. గతంలో మేమంతా చాలా పేదరికంలో ఉండేవాళ్లం. అప్పట్లో ఒక జానెడు స్థలం కొనుక్కోలేని పరిస్థితులు మావి. అలాంటి సమయంలో జానీ సాహెబ్ మా అందరికి ఇంటిస్థలాలు ఇచ్చాడు. ఆయన వల్లే మేమంతా తొలుత తలదాచుకునేందుకు ఇళ్లను నిర్మించుకున్నాం. ఆ తరువాత కాలంలో పెద్ద భవనాలను సైతం నిర్మించుకున్నాం.

– షేక్ బాషా సాహెబ్, జానీబాషాపురం, రాజంపేట

ఆయన చెప్పినట్లే జరిగింది



జానీబాషాపురం అద్దంలా అవుతుందని జానీబాషాసాహెబ్ చెప్పాడంట. ఈ మాట మా పెద్దలు ఎప్పుడూ చెబుతుండేవారు. ఆ మహనీయుడు చెప్పినట్లు ఇప్పుడు అద్దంలాగే తయారైంది. మాకు ఆయన చేసిన మేలు ఎప్పటికీ మరచిపోలేం. ఆయన చేసిన మేలుకు కృతజ్ఞతగానే ఆయన పేరిట ఉరుసు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నాం.

– జీకే.బాషా, జానీబాషాపురం, రాజంపేట

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు చర్యలు


చిన్న ఓరంపాడు వద్ద అమర్చిన డూమ్ లైట్లు

ఓబులవారిపల్లె: మండలంలో హైవేపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. శుక్రవారం మండల ఎస్ఐ పి.మహేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది చిన్నఓరంపాడు అడ్డరోడ్డు మలుపు వద్ద జాతీయ రహదారిపై ఇటీవల ప్రమాదాలు జరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడకుండా డూమ్ లైట్లను అమర్చారు. ప్రతినిత్యం ఈ మార్గం గుండా గ్రామీణ ప్రాంత ప్రజలు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎస్ఐ చొరవ తీసుకొని లైట్లు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భువనేశ్వరీకి పూజలు


అలంకరణలో భువనేశ్వరీ దేవి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని భుజంగేశ్వర ఆలయంలో వెలసి ఉన్న భువనేశ్వరీ దేవికి శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అలంకరించారు. రాత్రి అమ్మవారికి భజన బృందం ఆధ్వర్యంలో భజనలు ఏర్పాటు చేశాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు ఇస్తున్న అశోక్‌రెడ్డి

ఓబులవారిపల్లె : సంక్రాంతి సందర్భంగా మూడురోజులపాటు ఏర్పాటు చేసిన ఓబులవారిపల్లె బాడ్మింటన్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ యువ నాయకులు చిన్నిరెడ్డి అశోక్ రెడ్డి మాట్లాడుతూ పోటీలలో 32 జట్లు పాల్గొనగా హర్ష సంజీవరెడ్డి జట్టు విజేతలుగా నిలిచి రూ.7 వేలు మెమెంటోను అందుకున్నారన్నారు. అలానే చెంగల్ రాయుడు జట్టు ద్వితీయ స్థానంలో నిలవగా రూ. 5 వేలు నగదు, మెమెంటో, మనోజ్ కుమార్ రెడ్డి టీమ్ తృతీయ బహుమతి కింద రూ. 3 వేలు నగదును అందుజేశామని చెప్పారు. అందజేయడం జరిగిందని తెలిపారు.

పరామర్శ


మల్లయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూల్‌లో తనకు చదువు చెప్పిన విశ్రాంత ఉపాధ్యాయులు సోమల మల్లయ్య సతీమణి సోమల శాంతమ్మ మృతి విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించి మల్లయ్యను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న వీరనారాయణ

సుండుపల్లె : కుష్టు వ్యాధిపై ప్రజలు అవగాహన తప్పనిసరిగా ఉండాలని ఎంపీహెచ్ఈఓ వీరనారాయణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలలో ఎవరికైనా స్పర్శ, జ్ఞానం లేని పొడలు, ముఖం, చెవులు, వీపు మీద బుడిపలు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, పాదాలు, చేతులపై బొబ్బలు వంటి లక్షణాలు ఉంటే పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే అంగవైకల్యం రాకుండా ఉచితంగా చికిత్స పొందవచ్చాన్నారు. కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

29న టెంకాయలు విక్రయించుకునేందుకు వేలం

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ గుడి ఆవరణలో సంవత్సరం టెంకాయలు విక్రయించుకునేందుకు ఈ నెల 29వ తేదీ ఉదయం వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. టెండరుదారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

నేడు మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం

సుండుపల్లె : మండల పరిధిలోని మామిడి రైతులకు రాయచోటి రోడ్డు ఈడిగపల్లి సమీపంలో ఉన్న మామిడి తోటలో శనివారం (నేడు) అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ఉద్యానవన అధికారిణి వనిత ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున మామిడి తోటలు వేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వరసిద్ధి వినాయకుడికి అభిషేక పూజలు


అభిషేక పూజలందుకున్న వినాయకుడు

నందలూరు : నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి ఆలయ అర్చకులు సరసా రవి కుమార్ ఆధ్వర్యంలో ఉదయం భక్తి శ్రద్ధలతో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి ప్రదోష కాల పూజ జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడడం అందరి బాధ్యత


గౌరమ్మకు పూజలు చేస్తున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడం అందరి బాధ్యతని శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని ఆయన తన స్వగ్రామమైన రెడ్డివారిపల్లిలో గొబ్బిళ్లు (గౌరమ్మను) సాగనంపే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు గౌరమ్మకు ప్రత్యేక పూజలు, పాటలు భజనలతో నిమజ్జనానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి పండుగను గ్రామస్తులు నిర్వహించడం సంతోషకరమన్నారు. మహిళలు, రైతులకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రాముఖ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, రమణ, రఘు, మల్లి, రాజశేఖర్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీమ సదస్సును విజయవంతం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు

రాయచోటి అర్బన్ : ఈనెల 20వ తేదీన కర్నూలులో జరిగే రాయలసీమ సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ అన్నమయ్య జిల్లానేత ఎం.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించండి – దేశాన్ని కాపాడండి అన్న పిలుపుతో ఈనెల 20న లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే రాయలసీమ సదస్సును విజయవంతం చేయాలంటూ కోరారు. రాయలసీమ జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీమవాసులు ముఖ్యమంత్రిగా పనిచేసినా అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోకుండా ఓట్లు – సీట్లు కోసమే రాయలసీమను వాడుకుంటున్నారని ఆరోపించారు. రాయలసీమ రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నేతలు రమణ, రామాంజనేయులు, ప్రసాద్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం


మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని రాజంపేట బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం డిపో గ్యారేజ్‌లో డిపో మేనేజరు గుండాల రమణయ్య అధ్యక్షతన రోడ్డు భద్రతా మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని చర్యలు తీసుకుంటున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రవాణాశాఖ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్, హెల్మెట్ తప్పనిసరన్నారు. మద్యం తాగి డ్రైవింగ్ చేయడం, ఓవర్ టేక్, ఓవర్ స్పీడ్ లాంటి వాటికి వాహనదారులు దూరంగా ఉండాలన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. రోడ్ ప్రమాదాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజల్లో విరివిగా తీసుకెళ్లాలన్నారు. రాజంపేట డీఎం రమణయ్య మాట్లాడుతూ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆర్టీసీ సేవలే సుఖమయం, జయప్రదం, సురక్షితమని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి క్రీడా టోర్నీలు


వీరబల్లి: విజేతలకు బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నందలూరు: విజేతలకు బహుమతి అందజేస్తున్న టోర్నీ నిర్వాహకులు

నందలూరు : గెలుపు ఆనందాన్ని ఇస్తే ఓటమి రాబోయే గెలుపునకు బాటలు వేస్తుందని తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. శుక్రవారం టీవీ పురం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్లకు ఆయన బహుమతులు అందజేశారు. రసవత్తరంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టీవీ పురం, చింతకాయలపల్లి క్రికెట్ జట్లు తలపడగా చింతకాయలపల్లి జట్టు విజేతగా నిలిచింది. మ్యాన్ ఆఫ్ ది సీరిస్ జాఫర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా రమణ ఎంపికయ్యారు. అనంతరం విజేతలకు కప్పు, రూ. 20 వేలు నగదుతోపాటు రన్నర్స్‌కు మెమెంటో రూ.10 వేలు నగదును అందజేశారు.

వీరబల్లి : యువకులు క్రీడల్లో రాణించి, తమ భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని క్రికెట్ టోర్నీ నిర్వాహకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వివేకానందారెడ్డి, వీరనాగిరెడ్డిలు అన్నారు. తమ తండ్రి జెడ్పీ మాజీ సభ్యులు గాలివీటి రామకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నీని నిర్వహించామని వారు తెలిపారు. గత 16 రోజుల నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఈ టోర్నీ జరుగుతోంది. శుక్రవారం నాయుడు లెవన్స్, చందు లెవన్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగగా చందు లెవన్ జట్టు విజయం సాధించింది. విజేతలకు రూ. 50,116లు, రన్నర్స్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్రపురెడ్డి సుభాష్ రెడ్డి రూ.30,116లు అందజేశారు. అంతేకాక మ్యాన్ ఆఫ్ ది సీరిస్‌గా చందు లెవన్ జట్టుకు చెందిన శ్రీనుకు రూ.5 వేలు అందించారు. అలానే టోర్నీ గెలిచిన టీంకు సుభాష్ రెడ్డి రూ.10 వేలు అందజేసి అభినందించారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహించిన దాతలకు ఆర్గనైజర్స్ శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు గాలివీటి వివేకానందరెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రౌండ్‌లో కేక్ కట్ చేసి మైదానంలో ఉన్న క్రీడాకారులకు, అక్కడికి హాజరైన ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.

హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈగా..

బి.కొత్తకోట : హంద్రీనీవా ప్రాజెక్టు మదనపల్లె సర్కిల్–3 ఎస్ఈగా విఠల్‌ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ కమిషనరేట్‌లో ఈఈగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఎస్ఈగా మదనపల్లెకు బదిలీ చేశారు. సత్యసాయిజిల్లా కదిరి ఈఈగా పని చేస్తున్న సీఆర్.రాజగోపాల్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో మదనపల్లె ఎస్ఈగా ఇప్పటిదాకా పనిచేశారు. దీనితో ఆయన తిరిగి కదిరి ఈఈగా బాధ్యతలు చేపట్టనున్నారు.

బదిలీల్లో ఎన్‌సీసీతో సమానంగా ప్రాధాన్యతనివ్వండి

రాయచోటి (జగదాంబసెంటర్) : ఉపాధ్యాయ బదిలీలలో ఎన్‌సీసీ అర్హత ఉన్న ఉపాధ్యాయులకు అనుసరించే విధానాలనే అడ్వాన్స్ ట్రెనింగ్ పూర్తి చేసిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు వర్తింపజేయాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి శుక్రవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ అన్నమయ్య జిల్లా సెక్రటరీ నర్సింహారెడ్డి వినతిపత్రం అందజేశారు. అడ్వాన్స్ ట్రెనింగ్ పూర్తి చేసిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లను అదే స్కౌట్ విభాగంలో పోస్టు ఖాళీగా ఉన్న పాఠశాలలకు మాత్రమే వారిని బదిలీ చేయాలని వినతిపత్రంలో విన్నవించారు. అలా సాధ్యం కానప్పుడు వారిని అదే పాఠశాలలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ద్వితీయ సంవత్సరంలో ఉన్న స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. కావున ప్రస్తుతం ఏప్రిల్‌లో నిర్వహించనున్న ఉపాధ్యాయ బదిలీలలో ప్రస్తుతం అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్‌లకు, గైడ్ కెప్టెన్లకు ఎన్‌సీసీ వారికి ఇచ్చిన విధంగా ప్రాధాన్యత కల్పించవలసినదిగా విన్నవించారు. దీని వలన విద్యార్థులకు న్యాయం జరగడమే కాకుండా శిక్షణ పొందిన అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు సేవలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు.

నోడల్ అధికారుల నియామకం

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నేడు ప్రారంభిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నోడల్ అధికారుల నియమించినట్లు ఎంపీడీఓ కెఆర్ఎం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తమాధవరం పంచాయతీకి నోడల్ ఆఫీసర్‌గా ఎంఈఓ వెంకట సుబ్బయ్య, రాయగూడిపల్లెకు ఏపీఎం అశోక్ కుమార్ రెడ్డి, సాలాబాద్‌కు హౌసింగ్ ఏఈ సాయిదీప్, పెద్దపేరూరుకు వెటర్నరీ సర్జన్ స్వాతి, గంగపేరూరుకు ఎంఈఓ–2 ప్రభాకర్, మంటపంపల్లికి ఏపీఓ శివకుమార్ రెడ్డి, తింతరాజుపల్లి పంచాయతీకి పీఆర్ ఏఈ కృష్ణ ప్రసాద్‌ను, నరవకాటిపల్లెకు మెడికల్ ఆఫీసర్ శ్వేతను నోడల్ అధికారులుగా నియమించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న పోలీసు సిబ్బంది

గాలివీడు : ద్విచక్ర వాహదారులు హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చని ఎస్ఐ రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గుర్రాలమిట్ట వద్ద వాహనాలను తనిఖీ నిర్వహించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోతే చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ప్రస్తుతం నూతన చట్టాల మేరకు భారీగా జరిమానాలు ఉంటున్నాయని చెప్పారు. బైక్ రేసులు, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు డ్రైవింగ్ చేయటం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం తదితర నేరాల నుంచి దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

మదనపల్లె : సత్సంగ్ ఫౌండేషన్, వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని నక్కలదిన్నె స్వాస్థ్య హాస్పిటల్‌లో ఉచిత గుండె పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. వైదేహి హెడ్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్, సీనియర్ హార్ట్ సర్జన్ డాక్టర్ దుర్గాప్రసాద్‌రెడ్డి శిబిరంలో పాల్గొని రోగులకు చికిత్సలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఈసీజీ, 2డి–ఎకో స్కాన్, బీపీ తదితర పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైల్వే కార్మికులు

నందలూరు : రైల్వే ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని స్థానిక మజ్దూర్ యూనియన్ సెక్రటరీ విశ్వనాథ్ డిమాండ్ చేశారు. ఎస్‌సీఆర్ఎంయూ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ శంకర్ రావు పిలుపుమేరకు ఇంజనీరింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శుక్రవారం స్థానిక ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈనెల 24వ తేదీన గుంతకల్‌లోని డీఆర్ఎం కార్యాలయం ఎదుట, వచ్చేనెల 5వ తేదీన సికింద్రాబాద్‌లోని జీఎం కార్యాలయం ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాక్ మెయింటెయినర్స్ ఖాళీలను వెంటనే భర్తీ చేయడం, ఉమెన్ ట్రాక్ మెయింటెయినర్లను వేరే డిపార్టుమెంట్‌లకు పంపించాలన్నారు. ట్రాక్ మెయింటెయినర్ల డ్యూటీ రోస్టర్ రెండు షిఫ్టులుగా ఉండాలని డిమాండ్ చేశారు. అలానే పనిభారం తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ స్థానిక బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ ప్రకాశం, సిద్దయ్య, వైస్ చైర్మన్‌లు బీవీఎస్‌కె రాజు, ఎన్.నరసింహులు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పీరయ్య, షేక్‌షా వలీ, బాలసుబ్రమణ్యం, శ్రీహర్ష, అశోక్, సుదర్శన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సుబ్బరాయుడు

సిద్ధవటం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఇండ్లు సుబ్బరాయుడు తెలిపారు. సిద్ధవటం మండలంలోని మాధవరం – 1,2,3 వార్డుల గ్రామ పంచాయతీలో శుక్రవారం డ్రైడే – ఫ్రైడే సందర్భంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇంటింటి సర్వే చేసి గృహ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ వ్యాధి కారకమైన దోమ కుడితే విష జ్వరాలు సోకుతాయని దోమల నియంత్రణకు అందరూ సహకరించాలన్నారు. మురుగునీటిలో వారానికి ఒక సారి కిరోసిన్ ఆయిల్, ఇంజన్ ఆయిల్, చల్లడం వలన దోమల పుట్టుక పూర్తిగా అంతమవుతుందన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ వంటి విషజ్వరాలు సోకుతాయన్నారు. జాగ్రత్తల పాటించడంతోపాటు నివారణ చర్యలు తప్పనిసరి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణయ్య, పీహెచ్ఎన్ కాంతామణి, ఎంహెచ్‌సీ యానాదయ్య, ఆరోగ్య కార్యకర్త యశోద, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు కృష్ణదేవరాయలు ఆదర్శప్రాయుడు


లక్కిరెడ్డిపల్లి: శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలో బలిజ సంఘం నాయకులు



రైల్వేకోడూరు అర్బన్: రాయలు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కొరముట్ల, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీ కృష్ణదేవరాయలు ప్రజా పాలనలో పాలకులకు ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహానికి పార్టీ నాయకులతో కలసి పాలాభిషేకం నిర్వహించి గజమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని తరాలైనా, శతాబ్దాలైనా రాయలు వారి ప్రజా పరిపాలన నేటి తరం పాలకులకు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, శివయ్య, నందాబాల, రమణ, మల్లి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవ్యాంధ్రకాపు (బలిజ) సంఘం ఆధ్వర్యంలో..

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం శ్రీ కృష్ణదేవరాయలు 554వ జయంతి వేడుకలు నవ్యాంధ్ర కాపు బలిజసంఘం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు కడియాల వెంకట ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ కృష్ణ దేవరాయలు సుపరిపాలన అందించడమే కాకుండా ఆయన పాలనలో రత్నాలును రాసులుగా పోసి అమ్మేవారని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగడించడమే కాక ఆలయాల అభివృద్ధికి దోహదపడ్డారన్నారు. అలానే పేద ప్రజల కోసం చెరువులు, బావులు తవ్వించి ప్రజల దాహార్తిని తీర్చారన్నారు. కార్యక్రమంలో యనమల విశ్వనాథ్, గోవింద్ శ్రీకాంత్, గంట వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి కల్యాణోత్సవం


కల్యాణ క్రతువును జరుపుతున్న వేదపండితులు

పుల్లంపేట : పుల్లంపేటలోని శ్రీ శాంతిలింగేశ్వర స్వామి దేవస్థానంలో పెంచలకోన పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ ఆదిలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆగమ పండితులు వినోద్ స్వామి బృందం వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. నేడు శనివారం ఆలయ నిర్మాణ ప్రాంగణం నుంచి 20వ పాదయాత్ర ప్రారంభమవుతుందని పెంచలకోన పాదయాత్ర బృందం అధ్యక్షులు వేలూరు నరసింహ కుమార్ తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదాం

పీలేరు : సమిష్టి కృషితో బాలకార్మిక వ్యవస్థను రూపుమాపుదామని లేబర్ ఆఫీసర్ ఆనందబాబు అన్నారు. శుక్రవారం పాన్ ఇండియా బాలకార్మిక నిర్మూలన, పునరావాస కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాలకార్మిక చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన వారికి చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఉచిత నిర్బంధ విద్య హక్కు చట్టం ప్రకారం బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. వలస వచ్చిన వారికి విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామని తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.